క్లుప్తంగా

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



టేకులగడ్డ తండాలో గ్రాడ్యుయేషన్ డే

బొంరాస్‌పేట: మండల పరిధిలో టేకులగడ్డ తండాలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ఘనంగా గ్రాడ్యుయేషన్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు ఆటలు, పాటలతో సరదాగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి బొంరాస్‌పేట సెక్టార్ సూపర్‌వైజర్ మణిమాల, పూర్వ హెచ్‌ఎం శ్రీహరి, గోర్‌సేనా జిల్లా అధ్యక్షుడు రమేశ్‌నాయక్, గ్రామయూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజు, సురేశ్, అంగన్‌వాడీ కార్యకర్తలు భాగ్యలక్ష్మి, విజయలక్ష్మి, రాధా, చంద్రకళ, వాణి పాల్గొన్నారు.

సిరిగిరిపేట్‌లో తాగునీటి ఎద్దడి



ఖాళీ బిందెలతో నిరసన చేస్తున్న కాలనీవాసులు

తాండూరు రూరల్: మండల పరిధిలోని సిరిగిరిపేట్ గ్రామంలో తాగునీటి ఎద్దడి నెలకొంది. గ్రామంలోని విష్ణు ఇంటి వద్ద ఉన్న బోరు మరమ్మతులకు గురైంది. దీంతో వారం రోజుల నుంచి తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని కాలనీలోని మహిళలు వాపోతున్నారు. ఈ విషయాన్ని అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. మిషన్ భగీరథ నీళ్లు కలుషితంగా రావడంతో వాటిని తాగడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీఓ విశ్వప్రసాద్‌ను వివరణ కోరగా కార్యదర్శితో మాట్లాడి వెంటనే బోరు మోటారుకు మరమ్మతులు చేయించి తాగునీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

రాజీవ్ యువ వికాసానికి 2,219 దరఖాస్తులు

తాండూరు రూరల్: నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి మండల వ్యాప్తంగా 2,219 దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీఓ విశ్వప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33 గ్రామాల్లోని నిరుద్యోగ యువతీయువకులు దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ప్రారంభిస్తామని తెలిపారు.

నేడు తహసీల్దార్ ఉద్యోగ విరమణ

యాలాల: తహసీల్దార్ అంజయ్య బుధవారం ఉద్యోగ విరమణ చేయనున్నట్లు తహసీల్దార్ కార్యాలయ ఉద్యోగులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల పరిషత్ సమావేశ హాల్లో తహసీల్దార్ ఉద్యోగ విరమణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి ఈ సభ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

నూతన కార్యదర్శుల నియామకం

తాండూరు రూరల్: మండల పరిధిలోని అల్లాపూర్, గోనూర్ గ్రామాలకు నూతన పంచాయతీ కార్యదర్శులను నియమించినట్లు ఎంపీడీఓ విశ్వప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అల్లాపూర్ పంచాయతీ కార్యదర్శిగా శ్రీనాథ్, గోనూర్ పంచాయతీ కార్యదర్శిగా నరేశ్‌లను నియమించామని పేర్కొన్నారు. కరన్‌కోట్ పంచాయతీ కార్యదర్శి ఆనంద్‌రావు యాలాల మండల కేంద్రానికి బదిలీపై వెళ్లారు.

సేవలోనే అసలైన తృప్తి



రక్తదానం చేస్తున్న బీఎస్పీ కార్యకర్తలు

తాండూరు టౌన్: బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోయిని చంద్రశేఖర్ ముదిరాజ్ జన్మదిన వేడుకలను మంగళవారం పార్టీ స్థానిక కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం స్థానిక మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో పండ్లు, పాలు, బ్రెడ్లు పంపిణీ చేశారు. పలువురు కార్యకర్తలు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ప్రజా సేవలోనే అసలైన సంతృప్తి లభిస్తుందన్నారు.

డబుల్ ట్రబుల్!

అర్ధంతరంగా నిలిచిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు

- కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ముందుకు సాగని పనులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న లబ్ధిదారులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



పూర్తికాని డబుల్ బెడ్‌రూం ఇళ్లు

దోమ: అధికారుల నిర్లక్ష్యమో, పాలకుల అలసత్వమో వెరసీ లబ్ధిదారులకు డబుల్‌బెడ్‌రూం ఇళ్లు కలగానే మిగిలింది. గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు అర్ధంతరంగా నిలిచిపోయాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లు లేని నిరుపేద కుటుంబాలకు త్వరితగతిన నిర్మించి పేదలకు పంపిణీ చేయాలని భావించింది. కానీ ఏళ్లు గడిచిన నిర్మాణాలు అసంపూర్తిగానే ఉన్నాయి. రాబోవు వర్షాలకు అవి ఎప్పుడు కూలీపోతాయో తెలియని దుస్థితి నెలకొంది. ఈ విషయాన్ని అధికారులు, పాలకులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం డబుల్ బెడ్‌రూం నిర్మాణాలు మధ్యలోనే అసంపూర్తిగా వదిలేశారని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో రూ. కోట్ల ప్రజాధనం దుర్వినియోగం అవుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ముందుకు సాగని పనులు

దోమ మండలానికి గత ప్రభుత్వం 48 ఇళ్లను మంజురు చేసింది. మంజురు చేసిన వాటిని మండల కేంద్రంలోని సర్వే నంబర్ 100లోని 2 ఎకరాల నాలుగు గుంటల ప్రభుత్వ భూమిలో ఏడెళ్లుగా అధికారులు నిర్మాణాలు చేపడుతున్నారు. కానీ అవి ఏళ్లు గడిచిన ముందుకు సాగని దుస్థితి నెలకొంది. గత ప్రభుత్వ హయాంలో కాంట్రాక్టర్ స్లాబ్, గోడలు మాత్రమే పూర్తి చేశారు. మిగిత పనులన్నీ నిలిపి వేశారు. ప్రస్తుతం నూతన ప్రభుత్వం ఏర్పాటై దాదాపు రెండు సంవత్సరాలు కావస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు ఆ వైపు చూడడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో పేదలు కలలుగన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లు కలగానే మిగిలిపోయాయి. నిర్మించిన పనుల్లో కూడా అధికారులు సరైనా నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడం పట్ల అవి పగుళ్లు ఏర్పడి శిథిలావస్థకు చేరుకున్నాయని పలువురు మండిపడుతున్నారు. ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు నిర్మాణ దశలోని ఇళ్లను పూర్తి చేసి ఇళ్లు లేని నిరుపేద కుటుంబాలకు కేటాయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఇందిరమ్మ పనుల్లోనూ జాప్యం

ఇందిరమ్మ పనుల్లోనూ కాంటాక్టర్లు జాప్యం చేస్తున్నారు. దోమ మండలంలోని శివారెడ్డిపల్లి గ్రామానికి 185 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. అందులో శివారెడ్డిపల్లి, శివారెడ్డిపల్లితండాలో కలుపుకొని కేవలం నాలుగు ఇళ్లను మాత్రమే కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు. అవి కూడా గోడల దశలో కొనసాగుతున్నాయి. మిగత ఇళ్లను నేటికి ప్రారంభించలేదు. దీంతో లబ్ధిదారులు తమకు ఇళ్లు ఎప్పుడు నిర్మించి ఇస్తారోనని ఆశతో ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పనుల్లో వేగవంతం పెంచేవిధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పర్యవేక్షణ లోపం



అధికారుల నిర్లక్ష్యం, పాలకుల అలసత్వంతోనే డబుల్‌బెడ్రూం ఇళ్ల నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయాయి. గత ప్రభుత్వ హయాంలో నిర్మాణాలు చేపడుతున్నప్పటికి పనులు పూర్తి కాకపోవడం శోచనీయం. క్షేత్ర స్థాయిలో ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం కారణంగానే సంబంధిత అధికారులు పనుల్లో ఆలస్యం చేశారు. వెంటనే డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలను నిర్మించి లబ్ధిదారులకు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలి.

– శ్రీకాంత్ రావు, మాజీ ఉపసర్పంచ్, మోత్కూర్

గోడల వరకే పరిమితం



గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించాలని అధికారులను ఆదేశించింది. కానీ ఉన్నతాధికారుల పర్యవేక్షణలోపంతో అవి అర్ధాంతరంగా నిలిచిపోయాయి. గోడల వరకు చేరుకొని మధ్యలోనే పనులు నిలిపేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై రెండు సంవత్సరాలు కావస్తున్నా వాటిని ముందుకు తీసుకెళ్లడం లేదు. దీంతో అవి మున్నాళ్ల ముచ్చటగానే నిలిచిపోయాయి.

– గోపాల్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు

త్వరలో పూర్తి చేస్తాం

డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిర్మాణ పనులు నాణ్యతతో పూర్తి స్థాయిలో నిర్మించేందుకు చర్యలు తీసుకుంటాం. బిల్లులు రాకపోవడం వలన కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే వదిలేశాడు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం బిల్లులు మంజూరు చేసింది. దీంతో కాంట్రాక్టర్‌కు పనులు చేయాలని ఆదేశించాం. త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– మహేశ్, ఏఈ, ఆర్‌అండ్‌బీ

రైతులు దళారులను నమ్మొద్దు

- మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి
- గోనూర్‌లో వరికొనుగోలు కేంద్రం ప్రారంభం



వరికొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న బాల్‌రెడ్డి, తదితరులు

తాండూరు రూరల్: రైతులు దళారులను నమ్మి ధాన్యాన్ని విక్రయించొద్దని తాండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని గోనూర్ గ్రామంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా బాల్‌రెడ్డి మాట్లాడుతూ..ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆదేశాలతో వరి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని అమ్ముకోవాలన్నారు. ధాన్యాన్ని ఆరబెట్టి 17శాతం తేమ ఉంటే కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. గన్నీ బ్యాగుల కొరత లేకుండా చూస్తామన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జెన్నె నాగప్ప, పీఏసీఎస్ చైర్మన్ రవిగౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నర్సిరెడ్డి, డైరెక్టర్లు ఉదయ్ భాస్కర్‌రెడ్డి, కరీం, డీసీఎంఎస్ ఇన్‌చార్జి సలాం పాషా, నాయకులు వడ్డె శ్రీనివాస్, హరినాథ్‌రెడ్డి, మల్లారెడ్డి, శ్రీనివాస్, మల్లేశ్, సతీష్, నవీన్, సంజీవ్‌రెడ్డి, అనంతప్ప, మొగులప్ప, రామప్ప పాల్గొన్నారు.

బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలి

పరిగి ఎమ్మెల్యే రామ్మోహనరెడ్డి



డీసీసీబీ శాఖను ప్రాంభిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

పూడూరు: సహకార బ్యాంకు సేవలను అన్ని వర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పరిగి ఎమ్మెల్యే డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి అన్నారు. మంగళవారం పూడూరు మండల పరిధిలోని మన్నెగూడలో స్థానిక నాయకులతో కలిసి నూతన డీసీసీబీ శాఖను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీసీసీబీలు పటిష్టంగా ఉంటే రైతులకు మేలు జరుగుతుందన్నారు. నూతనంగా ఏర్పాటైనా బ్యాంకులో ఖాతాలు తెరవాలన్నారు. ఈ కార్యక్రమం లో డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్వ సత్తయ్య, పాక్స్ చైర్మన్ సతీష్ రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు ఆనందం, రఘునాథ్ రెడ్డి, కార్యదర్శులు షకీల్, పెంటయ్య, శ్రీనివాస్, అజీమ్ పటేల్, మండల అధ్యక్షుడు సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రాం అడుగుజాడల్లో నడవాలి

బాబు జగ్జీవన్‌రాం అడుగుజాడల్లో ప్రతిఒక్కరూ నడవాలని పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో బాబు జగ్జీవన్‌రాం విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివి ఎన్నోకీలక పదవులు చేపట్టారని గుర్తు చేశారు. సమాజంలో రుగ్మతలను రూపు మాపాలంటే చదువు ఒక్కటే ఆయుధమన్నారు. నిజ జీవితంలో ప్రతిఒక్కరూ ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు.

'స్థానిక' ఎన్నికలకు బీజేపీ సిద్ధం



నూతన కమిటీతో బీజేపీ జిల్లా నేతలు

రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ప్రహ్లాదరావు

కుల్కచర్ల: స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీజేపీ సిద్ధంగా ఉందని రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కరణం ప్రహ్లాదరావు పేర్కొన్నారు. మంగళవారం కుల్కచర్ల మండల కేంద్రంలో మండల స్థాయి కార్యకర్తల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రానున్న ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు అత్యధిక స్థానాల్లో విజయం సాధించాలన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలుచేయడంలో విఫలమైందన్నారు. బీఆర్‌ఎస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఈ సమావేశంలో మండల కమిటీని నియమించారు. మండల అధ్యక్షుడిగా వెంకటయ్యముదిరాజ్, ప్రధాన కార్యదర్శిగా హన్మంతు, పోమాల నరేశ్, పెరుమాళ్ల వెంకటేష్ గౌడ్, ఉపాధ్యక్షుడిగా కొండ ఆంజనేయులు, రాజు, వెంకట్ రెడ్డి, రాంచంద్రయ్య, కార్యదర్శులుగా రామకృష్ణ, మల్లేశం, నర్సింలు, విజయలక్ష్మి, కోశాధికారిగా ప్రవీణ్ తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జె.వెంకటయ్య, జిల్లా కార్యవర్గసభ్యుడు కాటనిపల్లి అంజిలయ్య, జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి సౌమ్యారెడ్డి, ఎన్నికల ఇంచార్జి రాంచంద్రయ్య, కర్ణయ్య, చంద్రలింగం, మహేశ్, గోపాల్, పోశయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రేమ్‌రాజ్

షాద్‌నగర్: బూత్‌స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రేమ్‌రాజ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఏబీ కాంప్లెక్స్‌లో షాద్‌నగర్ మున్సిపాలిటీ, ఫరూఖ్‌నగర్ మండల బీజేపీ ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రేమ్‌రాజ్ మాట్లాడుతూ.. దేశంలోనే అత్యంత ప్రజాధరణ పొందిన పార్టీ బీజేపీ అన్నారు. ప్రధాని మోదీ ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా అనేక పథకాలను అమలు చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను గ్రామస్థాయిలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పార్టీ నాయకులు ముందుండాలని, తద్వారా పార్టీ క్షేత్రస్థాయిలో బలోపేతం అవుతుందన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీని నమ్మే పరిస్థితుల్లో లేరని విమర్శించారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి గ్రామంలో కాషాయ జెండా ఎగరాలని సూచించారు. సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్, నాయకులు అశోక్‌గౌడ్, కక్కునూరి వెంకటేశ్‌గుప్తా, ప్యాట అశోక్, మురళీ, ప్రశాంత్, రుషికేష్, వెంకటేశ్, హరిభూషణ్, సురేశ్, గణేశ్, కుర్మయ్య, నర్సింలు పాల్గొన్నారు.

చలో వికారాబాద్ విజయవంతం చేయాలి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ జయరాం తదితరులు

నవాబుపేట: వికారాబాద్ పట్టణంలో 12 అడుగుల అంబేడ్కర్ కాంస్య విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వస్తావా కమిటీ సభ్యులు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ మే7న వికారాబాద్‌లో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం బట్టు విక్రమార్క, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ హాజరవుతున్నట్లు తెలిపారు. మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు, దళిత సంఘాల నాయకులు, యువజన సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పవన్ కుమార్, నర్సింలు, చంద్రశేఖర్, రత్నం, తదితరులు పాల్గొన్నారు.

ఒకే బ్రేకర్‌తో విద్యుత్ సమస్యలు

బంట్వారం: తొర్మామిడి విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఒకే బ్రేకర్ ఉండటంతో ఓవర్‌లోడ్ సమస్యలు తలెత్తుతున్నాయని కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి మోహన్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. తొర్మామిడి, బస్వాపూర్ గ్రామాలకు వ్యవసాయ, వ్యవసాయేతర విద్యుత్ సరఫరాకు సంబంధించి రెండు బ్రేకర్లు ఏర్పాటు చేయాల్సి ఉన్నా విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. రెండు గ్రామాలకు ఒకే బ్రేకర్ ఉండటంతో తొర్మామిడికి కరెంటు సరఫరాలో తరచూ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని తెలిపారు. ఈ విషయమై పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని పేర్కొన్నారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించకపోతే సబ్ స్టేషన్ ఎదుట ధర్నా చేస్తామని తెలిపారు.

నేడు బాల్య వివాహాల నిర్మూలనకు అవగాహన

ధారూరు: అక్షయ తృతీయ సందర్భంగా బుధవారం బాల్య వివాహాల నిర్మూలనకు దేవాలయాలు, మసీదుల్లో మతపెద్దలు, పురోహితులతో అవగాహన సమావేశాలు నిర్వహిస్తున్నట్లు సాధన సంస్థ కో ఆర్డినేటర్ బి. అంజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. వివాహాలు చేయడంలో ముఖ్య భూమిక పోషించే వారితో బాల్య వివాహాలు నిషేధించడానికి గత సంవత్సరం నుంచి జిల్లాలోని ధారూరు, తాండూర్, పెద్దేముల్, వికారాబాద్, మర్పల్లి మండలాల్లోని 50 గ్రామాలను ఎంపిక చేసుకుని సాధన సంస్థ ఈ ఉద్యమాన్ని కొనసాగిస్తుందని ఆయన గుర్తు చేశారు. బుధవారం ఆయా మండలాల్లోని గ్రామాల్లో దేవాలయాలు, చర్చిలు, మసీదుల్లోని మత పెద్దలతో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పిస్తామని తెలిపారు. బాల్య వివాహాలను నిర్మూలించేందుకు ప్రతీఒక్కరు సహకరించాలని కోరారు.

అడ్మిషన్ల పెంపునకు కృషి చేయాలి

ఇంటర్ బోర్డు నోడల్ అధికారి శంకర్ నాయక్



మాట్లాడుతున్న నోడల్ అధికారి శంకర్ నాయక్

తాండూరు టౌన్: తాండూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ ఏడాది అడ్మిషన్ల పెంపు కోసం అందరూ సమష్టిగా కృషి చేయాలని ఇంటర్ బోర్డు నోడల్ అధికారి శంకర్ నాయక్ పిలుపు నిచ్చారు. మంగళవారం తాండూరు జీజేసీలో అధ్యాపకులు, సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల్లో ఈ సంవత్సరం తాండూరు జీజేసీ మొదటి సంవత్సరం ఫలితాల్లో 55 శాతంతో ప్రథమ స్థానం, సెకండియర్‌లో 73 శాతంతో తృతీయ స్థానం రావడం అభినందనీయమన్నారు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో సప్లిమెంటరీ పరీక్షల కోసం అధ్యాపకులు వారిని సిద్ధం చేయాలన్నారు. ఈ ఏడాది ఇంటర్ ఫస్టియర్ అడ్మిషన్ల కోసం పదోతరగతి పాసైన విద్యార్థుల వద్దకు వెళ్లి వారు ప్రభుత్వ కళాశాలలో చేరేలా అవగాహన కల్పించాలన్నారు. కళాశాలలో తెలుగు, ఆంగ్లం, ఉర్దూ మీడియంలో బోధన ఉంటుందని విద్యార్థులకు వివరించాలన్నారు. ఈ సమావేశంలో ఇంచార్జి ప్రిన్సిపాల్ మల్లినాథప్ప, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి పెద్దపీట

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో కొందుర్గు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అన్నదాతల సంక్షేమానికి పూర్తిగా కట్టుబడి ఉందన్నారు. రైతులు పండించిన వరి ధాన్యానికి ఏ గ్రేడ్‌కు రూ.2320ల మద్దతు ధర చెల్లిస్తుందన్నారు. రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్ముకోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో మాత్రమే రైతులు ధాన్యాన్ని విక్రయించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా రవాణా, హమాలీ, గోనె సంచుల కొరత రాకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యవసాయంలో నూతన పద్ధతులు పాటించాలని, వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలతో రైతులు ముందుకు సాగాలని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, ప్రాథమిక సహకార సంఘం చైర్మన్లు బక్కన్నయాదవ్, దామోదర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరక్టర్లు మల్లేశ్, కరుణాకర్, భాస్కర్, నవీన్, భరత్, రవినాయక్, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, బస్వం, ఇబ్రహీం, బాల్‌రాజ్‌గౌడ్, సుదర్శన్‌గౌడ్, హరినాథ్‌రెడ్డి, కుమారస్వామి, పురుషోత్తంరెడ్డి, శ్రీనివాస్, కృష్ణ, రఘునందన్ పాల్గొన్నారు.

సభ అట్టర్ ఫ్లాప్ అనడం హాస్యాస్పదం



సమావేశంలో మాట్లాడుతున్న రాజుగౌడ్ తదితరులు

తాండూరు: వరంగల్ జిల్లాలో జరిగిన బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ అట్టర్ ఫ్లాప్ అయిందనడం హాస్యాస్పదంగా ఉందని వికారాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సందల్ రాజుగౌడ్ పేర్కొన్నారు. మంగళవారం తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి నివాసంలో నియోజవకర్గంలోని మండల అధ్యక్షులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజుగౌడ్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ సభ గురించి ఆ ముగ్గురు మంత్రులు స్పందించాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ పార్టీ పాతికేళ్లుగా ఏమి చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేస్తుందనేది ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని దారులు ఎల్కతుర్తి సభ వైపునకు జనసంద్రంగా మారడంతో కాంగ్రెస్ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. సభ ప్రాంగణంలో ఉన్న జనం కంటే సభ బయట, రోడ్లపై రెండింతల జనం ఉన్నారన్నారు. లక్షలాదిగా వచ్చిన జనాలతో దేశంలోనే ఎక్కడ లేని విధంగా సభ విజయవంతం అయిందని రాష్ట్ర, జాతీయ మీడియాలలో ప్రత్యేక కథనాలు వచ్చాయని గుర్తు చేశారు. కాంగ్రెస్ నేతలు దమ్ముంటే ఇలాంటి సభను పెట్టుకోవాలని సూచించారు. అప్పుడు ఎవరి బలం ఎంటో అర్థమవుతోందని చెప్పారు. ఈ సమావేశంలో యాలాల మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, పెద్దేముల్ మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కోహిర్ శ్రీనివాస్‌యాదవ్, బషీరాబాద్ మండల అధ్యక్షుడు ఇందర్‌చెడ్ రాజు, తాండూరు మండల అధ్యక్షుడు వీరేందర్, తాండూరు పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ రజతోత్సవ సభ సక్సెస్



తాండూరు టౌన్: తెలంగాణాలో బీఆర్‌ఎస్ పాలన రామరాజ్యంగా కొనసాగితే నేడు రాక్షస రాజ్యంలా కొనసాగుతోందని తాండూరు నాయకుడు పట్లోళ్ల నర్సిములు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ రజతోత్సవ సభ గ్రాండ్ సక్సెస్ కావడంతో జీర్ణించుకోలేని కాంగ్రెస్ నాయకులు అవాకులు చవాకులు పేల్చుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి స్వచ్ఛందంగా కార్యకర్తలు వెల్లువలా తరలి రావడంతో కాంగ్రెస్ నాయకుల గుండెల్లో గుబులు మొదలైందని తెలిపారు. తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి నాయకత్వంలో పది వేలకు పైగా నియోజకవర్గం నుంచి సభకు తరలి వెళ్లడం గర్వనీయమని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో తిరిగి బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు.